క్లుప్తంగా

దేశ భవిష్యత్తే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

రాయవరం: దేశ భవిష్యత్తే దేశ ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమేశ్వరంలో గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనాతీరు, ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలకు వివరించేందుకు, కేంద్ర ప్రభుత్వ విజయాలు ప్రజలకు తెలియజేసేందుకు గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభనేని రవీంద్రబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, నల్లిమల్లి రామకృష్ణారెడ్డి, నిమ్మకాయల సాయి రాంప్రసాద్, రాయుడు శ్రీను పాల్గొన్నారు.

ప్రవచనకర్త 'కొంపెల్ల'కి సత్కారం



భీమేశ్వరాలయంలో ప్రవచనకర్త రాజ్‌కుమార్ శర్మను సత్కరించిన ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వేసవి తాపం తగ్గి సకాలంలో తగిన వర్షాలు కురిసి పంటలు బాగా పండాలన్న సత్ సంకల్పంతో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 10 నుంచి 18 వరకు మహాభారతంలోని విరాటపర్వం ప్రవచనాలు చెప్పిన ప్రవచనకర్త కొంపెల్ల భరణి రాజ్‌కుమార్‌శర్మను ఆలయ ఈఓ పి.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ రుత్వికులు ఇంద్రగంటి రామారావు, జుత్తుక చిన్నా, తుట్టగుంట సతీష్‌కుమార్, మైలవరపు నారాయణ, ఆలయ బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలుడి హంతకులను కఠినంగా శిక్షించాలి

మండపేట: చేరుకుపల్లి మండలం రాజోలు వద్ద అభంశుభం తెలీని బాలుడు ఉప్పల అమర్నాథ్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు పితృ వియోగం



చంద్రరావు(ఫైల్)

రాయవరం: మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావుకు పితృ వియోగం కలిగింది. శ్రీనివాసరావు తండ్రి చంద్రరావు (100) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. చివరి వరకూ ఆయన ఆరోగ్యంగానే ఉన్నారు. చంద్రరావుకు ఇరువురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కాగా శ్రీనివాసరావు తల్లి సూర్యాకాంతం గత ఏడాది ఆగస్టులో మృతి చెందారు. శ్రీనివాసరావుకు పితృ వియోగం కలగడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాజులూరు: గ్రామానికి చెందిన చొల్లంగి లోవకుమారి (35) మంచంపై నుంచి జారిపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆదివారం గొల్లపాలెం పోలీసులు తెలిపారు. లోవకుమారి గత కొన్నేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకుంది. ఈ నెల 14వ తేదీ బుధవారం మంచంపై నిద్రిస్తూ ప్రమాదవశాత్తూ జారిపడింది. తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకోవటంతో కుటుంబీకులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందింది. లోవకుమారికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆస్పత్రి సమాచారం మేరకు గొల్లపాలెం ఎస్సై ఎం.తుసీరామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తలపై కొట్టి గాయపరిచాడని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: గ్యాస్ బర్నర్‌తో తలపై కొట్టి తనను గాయపరిచారని మండలంలోని తోటపేటకు చెందిన కోట శ్రీను ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎస్.సత్య భుజంగరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోట శ్రీనుకు పొరుగింటి చంద్ర, జాన్‌లతో వివాదం ఏర్పడింది. చంద్ర, కోట శ్రీనులు గొడవ పడుతుండగా జాన్ గ్యాస్ బర్నర్‌తో తన తలపై కొట్టి గాయపరిచాడని శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైన్ల సమూల ప్రక్షాళన

- 5 నుంచి 6 అడుగుల వరకు సిల్టు
- రూ.23 లక్షలతో 6 కిలోమీటర్లు పూడికతీత



పూడిక తీయక ముందు డ్రైనేజీ ఇలా..

రామచంద్రపురం: ముందు చూపులేని చర్యల కారణంగా పట్టణంలోని ప్రధాన డ్రైన్‌లు సిల్టుతో మూసుకుపోయాయి. మున్సిపాలిటీలోని రెండు ప్రధాన డ్రైన్‌లు మూసుకుపోవటంతో గత ఏడేళ్లుగా మురుగునీటి సమస్య పట్టిపీడిస్తుంది. ప్రస్తుత కౌన్సిల్ ప్రధాన డ్రైన్‌లను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించింది. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశాలనుసారం మున్సిపాలిటీ అధికారులు ప్రధాన రహదారిలోని మురుగుకాలువల్లో సిల్టును గత 15 రోజులుగా తీస్తున్నారు. ఏడేళ్ల క్రితం పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకుని పెద్ద డ్రైన్లను నిర్మించారు. వీఎస్ఎం కళాశాల నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు, రాజగోపాల్ సెంటర్ నుంచి కాకినాడ రోడ్డులోని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, రాజగోపాల్ సెంటర్ నుంచి ద్రాక్షారామ రోడ్డులోని పెద్ద వంతెన వరకు సుమారుగా 6 కిలోమీటర్ల మేర ప్రధాన డ్రైన్లను నిర్మించారు. వీఎస్ఎం కళాశాల వద్ద 5 అడుగుల లోతు ఉంటే డ్రైన్ చివరకు వచ్చేసరికి 7 అడుగుల స్లోపు ఉంచుతూ నిర్మాణం చేశారు.

ముందు చూపులేని చర్యలతో ఇక్కట్లు

పట్టణంలోని 28 వార్డుల నుంచి వచ్చి మురుగునీరు చిన్న చిన్న కచ్చా డ్రైన్ల ద్వారా ప్రవహించి ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉండే పెద్ద డ్రైన్ల ద్వారా వెల్ల రోడ్డులోని ప్రధాన మురుగుకాలువలకు వెళుతుంది. అయితే ఏడేళ్ల క్రితం ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించారు. ఈ నిర్మాణ సమయంలో ఆర్అండ్‌బీ అధికారులు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఈ డ్రైన్‌లపై పెద్ద పెద్ద సిమ్మెంట్ దిమ్మలను ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ టైల్స్‌ను అతికించేశారు. దీంతో ఎప్పుడైనా డ్రైన్‌లో మురుగునీరు ప్రవహించకపోతే వాటిని బద్దలు కొట్టి డ్రైన్లను సరిచేయాల్సిన పరిస్థితులుండేవి. అయితే ఈ ప్రధాన డ్రైన్‌లు పూర్తిగా మూసుకుపోయాయి. డ్రైన్లలో సుమారుగా 5 నుంచి ఆరున్నర అడుగుల వరకు సిల్టుతో మూసుకుపోయాయి. దీంతో నీరు ప్రవహించక మురుగునీటి ఇబ్బందులు తలెత్తాయి.



పూడిక తీసిన తరువాత లోతుగా ఉన్న డ్రైనేజీ

సమస్యకు పరిష్కారం

గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రస్తుతం మంత్రి వేణు గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకునే వారు అందులో భాగంగా పట్టణంలో చాలా చోట్ల ఈ ప్రధాన డ్రైన్ల సమస్యను ఆయన వద్దకు తీసుకు వచ్చారు. దీంతో మంత్రి వేణు ప్రధాన డ్రైన్లను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. ఆరు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ డ్రైన్లను రూ.23 లక్షలతో పూడిక తీసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ద్వారా గత 15 రోజులుగా ప్రధాన డ్రైన్లలో సిల్టు తీస్తున్నారు. అయితే డ్రైన్లలో రెండు నుంచి మూడు అడుగుల వరకు సిల్టు ఉంటుందని భావించిన అధికారులకు డ్రైన్లపై ఉన్న బల్లలు తొలగించిన తరువాత అవాక్కయారు. డ్రైన్లలో 5 నుంచి 6 అడుగుల వరకు సిల్టు ఉండటంతో త్వరితగతిని అవ్వాల్సిన పనులు రోజుల తరబడి కొనసాగుతున్నాయి. డ్రైన్లలో వస్తున్న సిల్టును మెషీన్ల ద్వారా తీసి ట్రాక్టర్లతో డంప్ చేస్తున్నారు. డ్రైన్ల పూడికతీత కారణంగా కొంత మేర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్న ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం అవుతుందని పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాలకు మించి పూడిక



కొన్నేళ్లుగా డ్రైన్‌లు పూడిక తీయకపోవటంతో భారీగానే సిల్టు ఉంటుందని భావించాం. రెండు నుంచి మూడు అడుగుల మేర ఉంటుందనుకుంటే సుమారుగా అయిదున్నర అడుగుల వరకు సిల్టు పేరుకుపోయింది. ప్రధాన డ్రైన్లు సరిగ్గా ఉంటే పట్టణంలో మురుగునీటి సమస్య అనేది ఉండదు గతకొంత కాలంగా పూడిక తీయకపోవటం మూలంగానే పెద్ద ఎత్తున సిల్టు పేరుకుపోయింది. ప్రస్తుతం ఈ పనులు పూర్తయితే డ్రైన్ల సమస్య ఉండదు.

– కె.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

మండపేట: పేదలకు చేతనైనంతలో అండగా నిలవడమే లక్ష్యంగా శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకుడు ఎగ్గాడి లోవరాజు పేర్కొన్నారు. స్థానిక 20వ వార్డులో వంద మందికి పైగా పేదలకు ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ కూలి పనులు చేసుకునే కొందరు యువకులు కలిసి ఇటీవల తమ సంస్థను ప్రారంభించామన్నారు. రానురాను తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. సంస్థ సభ్యులు కర్రి వెంకటరమణ, జి సురేష్, మందపల్లి సూరిబాబు, తాతపూడి సందీప్, సతీష్, బొడ్డపాటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో కొలువైన శ్రీధనమ్మ తల్లి ఆలయాన్ని భక్తుల అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దూరపు ప్రాంతాల పర్యాటకులు, భక్తులు ధనమ్మ మర్రిని సందర్శించారు. మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి నదీ తీరంలో నడియాడుతూ ఆహ్లాదకరమైన అందాలను ఆస్వాదించారు. అంగర ఎస్సై జి.చంటి ఆధ్వర్యంలోని అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజారంజక పాలనకు ప్రజలు మొగ్గు



ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరిన శెట్టిబలిజ సంఘం నాయకులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో వైఎస్సార్ సీపీలో చేరికలు

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి పెద్ద ఎత్తున జరుగుతున్న చేరికలే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఏడిద ఎర్ర నూతి సెంటర్ ప్రాంతంలోని టీడీపీ, జనసేన పార్టీల్లోని శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వంద కుటుంబాల వారు ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తోట త్రిమూర్తులు మాట్లాడారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న వేగుళ్ల జోగేశ్వరరావు ఏడిద గ్రామంలో సెంటు భూమి సేకరించి పేదలకు ఇచ్చింది లేదన్నారు. సీఎం జగన్ వచ్చాక 800 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామమైన ఏడిదలో సమస్యలు పరిష్కరించడం ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట సహకారంతో గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాలుకు రూ. ఐదు లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. రామాలయం ఆధునీకరణ, మరెన్నో అభివృద్ధి పనులు చేసుకోగలిగామన్నారు. డ్రైనేజీ నిర్మించాలని, కమ్యూనిటీ హాలు అభివృద్ధికి అదనంగా రూ. ఆరు లక్షలు కావాలని, ఇతర అభివృద్ధి పనులు చేయాలని రామారావు కోరగా ఎమ్మెల్సీ తోట సానుకూలంగా స్పందించారు. నూతనంగా పార్టీలో చేరిన కాకి శ్రీనివాస్, కొప్పిశెట్టి సత్తిబాబు, రెడ్డి అప్పారావు, పంపన కొండ, కురుపూడి కిషోర్, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ పాలన, ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, యువనేత తోట పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, జిల్లా కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, పార్టీ నాయకులు వాసిరెడ్డి అర్జున్, విసుపురెడ్డి శివ, పరమట తరుణ్, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి వేణు
- పట్టణంలో గడప గడపకూ..



పట్టణంలో స్థానికుల సమస్యలు వింటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలోని 25వ వార్డులో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సావధానంగా వింటూ పరిష్కారానికి అధికారులకు సిఫారసు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు అందులో భాగంగానే ఎటువంటి దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డబ్బులను జమ చేస్తున్నారని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ పథకాల సొమ్ము వేశారన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందేందుకు ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవని, దళారులు దోచుకునే వ్యవస్థ నుంచి ఎటువంటి ఇబ్బందులు, దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులకే పెద్దపీట వేశామని మంత్రి వేణు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పలు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న తీరును లబ్ధిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న దోబీ ఘాట్‌ను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలపై రజకులను అడిగి తెలుసుకున్నారు. వారి అభ్యర్థన మేరకు దోబీ ఘాట్‌లో కావాల్సిన సదుపాయాలను కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ టీ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కుడిపూడి లలిత, కోఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు పెంటపాటి శ్రీను, కంచుమర్తి బాబూరావు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, మున్సిపాలిటీ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మండలంలోని శలపాకలో వ్యవసాయాధికారులు సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని నిర్వహించి తొలకరి సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పుడెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు ఈ నెల ఒకటో తేదీన సాగునీరు విడుదల చేశారన్నారు. పంటకాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ మూడో వారం నాటికి నారుమడులు చల్లుకుని జూలై రెండో వారం నాటికి నాట్లు పూర్తి చేసినట్లయితే అక్టోబర్ నెలాఖరు నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు. తద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో దాళ్వా సాగు చేపట్టి మార్చి, ఏప్రిల్ నెలల్లో అంతర పంటలైన పెసర, మినుము మూడో పంటగా సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు చొరవచూపి సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలన్నారు. సర్పంచ్ పోతుల గనిరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి అనూష, పలువురు రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో విక్రయాలు నిషేధించాలి




కాకినాడ-కోటిపల్లి రహదారిని ఆనుకుని కోళ్ల తూము సెంటర్ వద్ద కల్వర్టుపై చేపలు, మాంసం విక్రయిస్తున్న వ్యాపారులు

కాజులూరు: బహిరంగ ప్రదేశాల్లో చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం గ్రామాల సరిహద్దులో కోళ్లతూము సెంటరు వద్ద కల్వర్టుపై కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని ఇటీవల కొన్నాళ్లుగా వ్యాపారులు చేపలు, మాంసం విక్రయాలు నిర్వహిస్తున్నారు. దీంతో రహదారిపై వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లపాలెం, కుయ్యేరు రహదారి పునర్నిర్మాణం పనుల్లో భాగంగా కాజులూరు జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు. దీంతో ప్రయాణికులు ఈ కోళ్ల తూము సెంటరు నుంచి చీకట్లవారిపేట మీదుగా కాజులూరు, కుయ్యేరు, యానం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. దీంతో ఈ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయింది. గొల్లపాలెం మార్కెట్ సెంటర్‌లో చేపలు, మాంసం విక్రయాలకు ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ షెడ్లను నిర్మించింది. కొందరు వ్యాపారులు ఈ మార్కెట్ షెడ్లలో చేపలు, మాంసం విక్రయాలు చేస్తుండగా కొందరు మాత్రం ప్రధాన కూడళ్లలో ఇలా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆర్యావటంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దేవు సదానందమూర్తి రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని బాధిత ప్రజల నుంచి సంతకాలు సేకరించి పలుమార్లు సంబంధిత గ్రామ సచివాలయాలకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన విన్నపాలు అధికారులు బుట్టదాఖలు చేయడంతో సమస్య యథాతథంగానే కొనసాగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

గొల్లపుంత కాలనీలో చోరీల బెడద

- వరుస దొంగతనాలతో కాలనీవాసుల బెంబేలు
- ఆందోళన కలిగిస్తున్న అపరిచిత వ్యక్తుల సంచారం




మండపేటలోని గొల్లపుంత కాలనీ

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో చోరీల బెడదతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి వేళల్లో దుండగులు ఇళ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. స్థలాలు పొందిన లబ్ధిదారుల కంటే అద్దెకు వచ్చిన వారే ఎక్కువగా ఉండగా, అపరిచిత వ్యక్తుల సంచారం కాలనీ వాసులను ఆందోళనకు గురి చేస్తోంది.

ఇందిరమ్మ పథకం కింద పదేళ్ల క్రితం దాదాపు 1900 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా వారిలో అధిక శాతం ఇళ్లు నిర్మించుకున్నారు. రానురానూ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో స్థలాలు, ఇళ్లు చేతులు మారాయి. మండపేటలో రూ.4000 పైబడి అద్దె ఉండగా పట్టణానికి మూడు కిలోమీటర్లు దూరంలోని ఈ కాలనీలో రూ. 3,000కు ఇళ్లు అద్దెకు ఇస్తున్నారు. ఉపాధి కోసం వలస వచ్చిన వారు కాలనీలో ఇళ్లను అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

కాలనీలో ఐదు వేల మందికి పైబడి జనాభా నివసిస్తున్నారని అంచనా. అపరిచిత వ్యక్తుల సంచారంతో చోరీల బెడద అధికంగా ఉంది. ఎండల తీవ్రతతో రాత్రి వేళల్లో ఆరుబయట, మేడల పైన నిద్రిస్తుండడంతో దొంగలు తాళాలు పగల గొట్టి తమ పని కానిస్తున్నారు. నెల రోజుల క్రితం ఇంటిలో ఉన్న వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసును ఒక వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. కాలనీకి చెందిన దుర్గారావుతో పాటు ఒక ఉపాధ్యాయురాలి మోటార్ సైకిళ్లు చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. వారం రోజుల క్రితం టిడ్కో ప్లాటులోని సుమారు రూ.లక్ష విలువ చేసే ఎలక్ట్రికల్ వైరు కట్టలను ఎత్తుకెళ్లారు. తాజాగా గొడ్డు కాలువ సమీపంలోని ఇంటిలో మూడు సెల్‌ఫోన్లు, పెద్ద వంతెన సమీపంలోని వీధిలోకి చొరబడి ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. చిన్నవంతెన సమీపంలోని వీధిలోని ఇంటిలో తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేసినట్టు స్థానికులు తెలిపారు. మోటారు సైకిళ్ల నుంచి పెట్రోల్ సైతం చోరీ చేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెద్దగా లేకపోవడం చోరుల ఇష్టారాజ్యంగా మారిందంటున్నారు. కాలనీలో గస్తీ ముమ్మరం చేయడం ద్వారా చోరీలు అరికట్టేందుకు పట్టణ పోలీసులు కృషిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మండే ఎండలతో జనం విలవిల



నిర్మానుష్యంగా ఉన్న కె.గంగవరం మెయిన్ సెంటర్

కె.గంగవరం: రోహిణి కార్తె దాటి మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు దాటిని సూర్య భగవానుడు భగభగలాడుతూనే ఉన్నాడు. మండే ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోతున్నాయి. ఉదయం 9 గంటలకే ఇంట్లో నుంచి జనం బయటకు రావడానికి హడలిపోతున్నారు. ఎండల తీవ్రత సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. ఎండ ప్రతాపానికి జనం వడదెబ్బకు గురై ఆసుపత్రి పాలవగా మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లలు, గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మండే ఎండల కారణంగా ఇంట్లో కూడా ఉండలేకపోతున్నామని ప్రజలు అంటున్నారు. సామాన్యులకే ఇలా ఉంటే పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎంత ఇబ్బంది పడుతున్నారో చెప్పనవసరం లేదు. రుతుపవనాల జాడ కానరాకపోవడంతో ఇంకెన్ని రోజులు ఈ ఉక్కపోత అంటూ మండల వాసుల ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు పంట కాలువల్లో సాగునీరు వదలడంతో రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఎండ ఉధృతికి జడిసి కూలీలు కూడా పనికి రావడం లేదని వారు చెబుతున్నారు.

అదుపుతప్పితే అంతే సంగతులు



బెర్మ్‌లు లేక కోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ఆసుపత్రి పాలవ్వాల్సిందే. పర్యాటకంగా ఆహ్లాదకరంగా ఉండే జొన్నాడ-యానాం ఏటిగట్టు రహదారికి బెర్మ్‌లు లేకపోవడం ముప్పుగా మారింది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రోడ్డు బాగుండడంతో జొన్నాడ-యానాం రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో బెర్మ్‌లు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకంరగా ఉంది. కోటిపల్లి-కోట, బ్రహ్మపురి-గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మ్‌లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్మ్‌లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఏటిగట్టు పరీవాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

హేమవర్షితకు 2,245వ ర్యాంక్



దాసి హేమ హర్షిత

అనపర్తి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాయవరానికి చెందిన దాసి హేమవర్షిత ఆల్ ఇండియా 2,245వ ర్యాంక్ సాధించింది. ఆమె అనపర్తి జీబీఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. ఐఐటీలో బీటెక్ ఇంజినీరింగ్ పూర్తి చేయడమే తన లక్ష్యమని హేమవర్షిత తెలిపింది. తన కుమార్తె ఆల్ ఇండియా ర్యాంకు సాధించడంపై ఆమె తల్లి ప్రసన్నకుమారి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హేమవర్షితను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, స్థానిక నేతలు అభినందించారు.

ఆర్పీఎల్ విజేతలుగా లోవ లెవెన్ జట్టు



రామచంద్రపురం ప్రీమియర్ లీగ్ ట్రోఫీతో లోవ లెవెన్స్ జట్టు

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న రామచంద్రపురం ప్రీమియం లీగ్(ఆర్పీఎల్) క్రికెట్ మ్యాచ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో రామచంద్రపురం లోవ లెవెన్స్ జట్టు విజేతలుగా నిలవగా, రామచంద్రపురం రాయల్ చాలెంజర్స్ టీమ్ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు బహుమతులు, ట్రోఫీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బాస్కెట్‌బాల్ జనరల్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి ట్రోఫీకి సహకరించిన దాతలు కేవీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.నాగసతీష్, అమృత రక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ రఘువీర్, విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్, జీఎస్ ఫ్రెండ్స్ సర్కిల్, యాళ్ల లోవకుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన బి.శ్రీమన్నారాయణ-ఝాన్సీ దంపతులు రూ.15,116, రావులపాలేనికి చెందిన కె.నాగమణి రూ.10,116 విరాళం అందజేశారని ఈవో తెలిపారు.